'నవ్య' వారపత్రిక - 17.8.2005

# మార్పు

**1982** డిసెంబర్ మూడవ తేది. సమయం రాత్రి ఎనిమిది గంటలు. వీధి లైట్లు గుడ్డిగా వెలుగుతున్నాయి. చలి గాలులు వీస్తున్నాయి. రోడ్డుపై పలచబడిన జనసంచారం. రెండు మూడు సందులు దాటి నారాయణ ఇంటి ముందు ఆగిందొక స్కూటర్.

'ఈ మురికి వాడలో ఎలా ఉండగల్గుతున్నావయ్యా నారాయణ' అనుకున్నాడు జితేంద్ర స్కూటర్ స్టాండ్ వేస్తూ.

అతడు పొడవుగా, సన్నగా ఉన్నాడు. వయసు ముప్పయ్ మూడేళ్ళు. రంగు తెలుపు. తెల్లటి షర్టుపై ఉలెన్ స్వెటర్. బ్లూ కలర్ ఉలెన్ ప్యాంటు. నల్లటి బూట్లు. ఒక పబ్లిక్ సెక్టార్‌లో ఎగ్జిక్యూటివ్ అతడు.

నారాయణ ఇంటికి అదురుతూ, బెదురుతూ ఒక దొంగలా వచ్చేడు. భయమో లేక చలి చేతో.. వణికే చేతులతో నారాయణ ఇంటి తలుపులు తట్టేడు జితేంద్ర.

తలుపులు తెరిచిన నారాయణ ఆశ్చర్యంతో, భక్తితో, గౌరవంతో తమ కంపెనీ మానేజర్ జితేంద్రని లోపలికి ఆహ్వానించేడు.

గోద్రేజ్ ఐరన్ ఛైర్‌పై కూర్చున్నాడు జితేంద్ర.

నారాయణ నల్లగా, పొట్టిగా, బలిష్టంగా ఉన్నాడు. వయసు ముప్పయ్యేళ్ళు. అతని ఒంటిపై ముతక చొక్కా లుంగీ పంచె. అతనికి చలి వేస్తున్నట్టు లేదు.

కార్మికుల్లో నారాయణ అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం జితేంద్రకి. నారాయణ లేకుండా వర్క్‌షాపుని ఊహించుకోవడం అతనికి చేతకాదు. ఒక ప్రొడక్ట్ తయారు చేయడానికి నిర్ణయించబడిన పని గంటల కన్నా తక్కువ సమయంలోనే చక్కటి నైపుణ్యంతో, నాణ్యతతో చేస్తాడు పని. ఒళ్ళు దాచుకోకుండా చిత్తశుద్ధితో ఒక గొడ్డులా కష్టపడతాడు.

"రెండు రోజులు వరసగా సెలవులొస్తే బోర్ కొట్టేస్తుందని గిజగిజలాడిపోతావ్. చేతిలో పనిలేకపోతే పిచ్చెక్కిపోతుందంటావ్. అలాంటిది ఇదేంటయ్యా.. ఎలా ఉండగలుగు తున్నావ్?" అని అడిగేడు జితేంద్ర.

నిజమే! నారాయణకి ఇంట్లో పిచ్చెక్కిపోతోంది. సోమరితనం తెలియని ప్రాణం వర్కు షాపులో అడుగు పెట్టేది ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు.

ఎదురు చూడడం తప్ప తనేమీ చేయలేడు. ఎందుచేతంటే కంపెనీలో సమ్మె జరుగుతోంది. నెలా పది రోజులుగా సమ్మె సాగుతోంది. వేతనర సవరణ కోసం సమ్మె సాగుతోంది.

నారాయణ భార్య కమల టీ తీసుకువచ్చి జితేంద్రకి ఇచ్చింది. ఆమె వెనుక ఇద్దరు చిన్న

పిల్లలు.

జితేంద్ర టీ కప్ తీసుకుంటూ "పిల్లలు భోజనం చేశారా?" అని కమలని అడిగేడు.

జీతాలు లేవు. పెళ్ళాం పిల్లలని పస్తుల్లో పెట్టాడేమోనని అతని అనుమానం. పిల్లలు భోజనం చేశారని చెప్పింది కమల. అయినా జితేంద్ర అనుమానం తీరక ప్రత్యక్షంగా పిల్లలనే అడిగేశాడు. ఆ పసిపిల్లలు తిన్నామని తలలాడించేరు. ఆ తర్వాత పిల్లలు తల్లితోబాటు లోపల గదిలోకి వెళ్ళిపోయారు.

తను వచ్చేటప్పుడు ఏవైనా పళ్ళు, స్వీట్లు తీసుకురావాలనే ఆలోచన స్ఫురించనందుకు చింతించేడు జితేంద్ర. అయితే తను మర్చిపోకుండా భద్రంగా కంపెనీ కాగితం మాత్రం తీసుకువచ్చేడు - నారాయణ సంతకం కోసం.

అది హామీపత్రం.

డిసెంబర్ ఆరో తేదీ లోగా కార్మికులు డ్యూటీలకు హాజరు కావాలని హెచ్చరించింది కంపెనీ. ఆ తేదీలోగా హాజరు కాని కార్మికులు సర్వీస్ నుంచి తొలగింపబడతారని ప్రకటించింది. కంపెనీ లోపలికి వచ్చేముందు హామీపత్రంపై సంతకం చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సమ్మెలు, పోరాటాలు చేసి ఉత్పత్తికి విఘాతం కల్పించమని, కంపెనీ స్టాండింగ్ రూల్స్‌కి బద్ధులై బుద్ధిగా పనిచేసుకుంటామని హామీ ఇవ్వాలి.

హామీపత్రంపై సంతకం పెట్టనన్నాడు నారాయణ.

"నారాయణా! నా మాట దయచేసి విను. సమ్మెలు దేశ సౌభాగ్యానికి హాని చేస్తాయి తప్ప మేలు చేయవు. ఈ హామీపత్రంపై సంతకం పెట్టు. నీవు, నీ సహచరులు సమ్మె విరమించి సత్వరం కంపెనీలో అడుగు పెట్టండి. కంపెనీని చూస్తే నాకు ఏడుపొస్తున్న దయ్యా! ఎప్పుడూ కళకళలాడే వర్క్‌షాపు శ్మశానవాటికలా బావురుమంటోందయ్యా! ఉత్పత్తి స్తంభించిపోవడంతో ఒక ప్రొడక్షన్ మేనేజర్‌గా కస్టమర్లకు సమాధానం చెప్పలేకపోతున్నాను. వాళ్ళు వర్క్ ఆర్డర్లు వెనక్కి తీసుకుని ఏ ప్రయివేటు కంపెనీకో ఇచ్చేస్తామని బెదిరిస్తున్నారు. పనిచేయని సోమరులు గేటు బయటవున్నా ఫరవాలేదు. నీలాంటి పనిచేయగల సమర్థులు ఈ కంపెనీకి కావాలి. ఈ దేశానికి కావాలి. ప్రభుత్వ రంగ సంస్థలు దేశానికి వెన్నెముక. ఒక కంచుకోట. మన సంస్థలను మనం కాపాడుకోవాలి గాని నాశనం చేసుకోకూడదు. నేను ఎందుకు చెబుతున్నదీ అర్థం చేసుకో"

"సర్! అర్థం చేసుకోవలసింది మేము కాదు. యాజమాన్యం. మన కంపెనీ లాభాలతో నడుస్తోంది. జీతాలు పెంచడానికి యాజమాన్యానికి ఏమి తెగులు? నిజవేతనాలు పడిపోతున్నాయి. అర్ధాకలితో ఏం పనిచేస్తాం? పావలా జీతం పెరగడానికి మేము ఇలా రోడ్డున పడి పోరాటాలు చేయాలి. నా ప్రార్థన ఏమిటంటే మీరు, మీ ఆఫీసర్లు సమస్తం మా కార్మికుల తరఫున నిలబడండి. వేతన సవరణకి యాజమాన్యంపై ఒత్తిడి చేసి ఒప్పించండి. ఒప్పుకోకుంటే మీరు కూడా సమ్మెలో పాల్గొని మాకు సహకరించండి" అని చేతులెత్తి దండం

పెట్టి – "సర్ మీరిక్కడ ఎక్కువ సేపు వుంటే ప్రమాదం. శాంతియుతంగా మేము సాగిస్తున్న ఈ పోరాటాన్ని యాజమాన్యం హింసాత్మకంగా మారుస్తున్న విషయం మా కన్నా మీకు బాగా తెలుసు. అంచేత తమరు దయచేసి మరిక మాటాడకుండా, వేగిరం, తక్షణం ఇక్కడ నుంచి బయటకు వెళ్ళిపోండి" అన్నాడు నారాయణ.

జితేంద్రకి ఒళ్లు మండింది. నారాయణ వర్క్‌షాపులో తన మాట ఎంతో వినయంగా వినేవాడు. చెప్పింది చేసేవాడు. తన మాట ఇక్కడా విని చెప్పింది చేస్తాడనుకుంటే తనకే పాఠాలు చెప్పి మర్యాదగా బయటకు వెళ్ళిపోమంటున్నాడు.

కుర్చీలోంచి భారంగా లేచేడు జితేంద్ర. లేచి జేబులోంచి రెండు వందల రూపాయల తీసి "నీ దగ్గర వుంచు" అన్నాడు.

"నాకొద్దు సర్"

"సమ్మె విరమించమని నేనేమీ నీకు లంచం ఇవ్వడం లేదయ్యా. నీ పిల్లల కోసం ఇస్తున్నాను. పోని అప్పుగానే ఇస్తున్నానుకో. తర్వాత ఇచ్చేద్దువులే" అని బలవంతం చేసి డబ్బులు అతని జేబులో వుంచేడు.

నారాయణ పైసలకి ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. అయినప్పటికీ మరొకరు మరొకరు ఇలా డబ్బిచ్చి వుంటే తీసుకోకుండా తిరగొట్టేవాడు. అతడికి జితేంద్రపై గౌరవం ఉంది. కళ్ళు చెమర్చగా, కృతజ్ఞతలతో చేతులెత్తి నమస్కరించేడు నారాయణ.

జితేంద్ర అక్కడ నుంచి ఇంటికి కాదు మరో కార్మికుడి ఇంటికి వెళ్ళే ప్రోగ్రాంలో వున్నాడు. హామీ పత్రాలు జేబులో దండిగా పెట్టుకున్నాడు.

మర్యాదపూర్వకంగా తనతో బాటు స్కూటర్ నిలిపివున్న స్థలం వరకూ రాబోతుంటే వద్దని వారించేడు జితేంద్ర. ఆ భార్యాభర్తలు ఇంకా భోజనం చేయలేదనేది గ్రహించి వెంటనే భోంచేయమన్నాడు.

నారాయణ తలుపులు వేసుకుని కమలతో భోజనానికి కూర్చోబోతుండగా బయట పెద్ద చప్పుడు.. పెనుకేకలు.

భూమి కంపించింది. ఆకాశం గర్జించింది. చలిపులి గాండ్రుమంది. వీధి లైట్లు బిలుక్కుమని నెత్తుటి పెంకులు కక్కేయి. కమ్ముకున్న చీకటి త్రాచులా పడగ విప్పింది.

నారాయణ పరుగున బయటకు వచ్చేటప్పటికే...

జితేంద్ర స్కూటర్‌పై మంటలే లేచేయి. అతడిపై బాణాకర్రలు లేచేయి. పిడిగుద్దులు పడ్డాయి.

తల పగిలి రక్తపు మడుగులో నేల కొరగకుండా...... నారాయణ గభాల్నా వచ్చి అడ్డుకున్నాడు. కార్మికులకు చేతులెత్తి నమస్కారం పెట్టి 'కొట్టింది చాలు వదిలేయమని ప్రార్థించేడు.

బతికి బయట పడ్డాడు జితేంద్ర. అతడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్ళడానికి తనకి

అప్పుగా ఇచ్చిన రెండు వందలు ఉపయోగపడ్డాయి నారాయణకి.

❁ ❁ ❁

జితేంద్రని ఆసుపత్రికి జాయిన్ చేసి, పరుగున వెళ్ళి సుజాతను తీసుకువచ్చేడు నారాయణ.

సుజాత జితేంద్ర భార్య. వాళ్ళది ప్రేమ వివాహం.

సమ్మెకు వ్యతిరేకంగా పనిచేస్తున్న జితేంద్రకి ప్రాణాపాయం పొంచి వుందని, అంచేత అతణ్ణి కలుగజేసుకోవద్దని చెప్పమని ముందుగానే యూనియన్ సుజాతను హెచ్చరించింది. ఆ విషయం సుజాత చెబితే లక్ష్యపెట్టలేదు జితేంద్ర.

అభ్యుదయ భావాలుగల కుటుంబం నుంచి వచ్చిన సుజాతకి ఈ ఆర్థిక వ్యవస్థలో దివాళాకోరు, దగాకోరు విధానాలు తెలియనివి కావు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, పన్నులు పెరిగి, అది ఇది అని కాకుండా సమస్తం పెరిగి శ్రామిక వర్గం నిజవేతనాలు పడిపోయేయి. వేతన సవరణకు కార్మికులు చేస్తున్న సమ్మె ఆమెకు న్యాయంగానే తోచింది.

సమ్మెకు వ్యతిరేకంగా జితేంద్ర యాజమాన్యంతో సహకరించడం ఎంతగానో బాధ కలిగించింది ఆమెకు.

"సుజాతా! నీవు బాధపడాల్సినంత నీచమైన పని నేనేమీ చేయడం లేదు. వీళ్ళు సమ్మె చేస్తున్నది ఎవరి మీద? టాటా, బిర్లాల మీద కాదు. బహుళ జాతి కంపెనీల మీద కాదు. ప్రజాధనంతో భారతజాతి సృష్టించుకున్న ఒక పబ్లిక్ సెక్టార్ మీద? అవునా? మరి నీకు ఈ సమ్మె ఎలా న్యాయంగా తోస్తోంది?

నేను సమ్మెలకే కాదు. కంపెనీ విధించే లాకౌట్లకు కూడా తీవ్ర వ్యతిరేకిని. నేనే కాదు. దేశభక్తి గలవారు ఎవరైనా సరే... ప్రభుత్వ రంగ సంస్థలను దేవాలయాలుగా భావిస్తారు. చెమట చినుకులతో ఉత్పత్తిని సృష్టించే శ్రామికులను దేవుళ్ళుగా పూజిస్తారు. ఎటువంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా సంస్థ ఎప్పుడూ పచ్చగా కళకళలాడుతూ వెలిగిపోతుండాలని నేను కోరుకుంటాను. అది నీవు గ్రహించు.

"అవును సుజాతా! నిజం. నాకు కంపెనీ సైరన్ శంఖారావంలా వినిపించి ఉత్తేజితుడిని చేస్తుంది. వర్క్‌షాపులో యంత్రాల చప్పుడుకి నా గుండె గజ్జెల నృత్యం చేస్తుంది. శ్రామికుల చెమట వాసన నాకు పైరుగాలిని తలపింపచేస్తుంది.

"నీకు నేను స్పష్టం చేస్తున్నది ఏమిటంటే.... ఈ పబ్లిక్ సెక్టార్ నా కన్నతల్లి. ఇంజనీరింగ్ డిగ్రీతో నేను రోడ్డున పడకుండా ఆప్యాయంగా ఒడిలోకి తీసుకున్నదీ తల్లి. అంతేకాదు ట్రెనింగ్ కోసం రెండుసార్లు జర్మనీ పంపి నన్నొక ప్రొడక్షన్ మేనేజర్ స్థాయికి పెంచింది ఈ తల్లి. నా తల్లి గుండె చప్పుడు ఆగిపోకూడదు. అవసరమైతే నా ప్రాణాలైనా ఇస్తాను" అంటూ సమ్మెకు వ్యతిరేకంగా ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు జితేంద్ర. నారాయణ చక్రంలా అడ్డు నిలబడకపోతే ఏమయివుండేవాడు? సుజాత అదృష్టం అనాలి.

తనని చావు దెబ్బలు కొట్టి ఆసుపత్రి పాల్జేసిన కార్మికులపై ద్వేషం ప్రకటించలేదు

జితేంద్ర. అతనిపై దాడిచేసిన కార్మికులపై కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధపడింది యాజమాన్యం. తనని కొట్టిన కార్మికులలో ఒకరిద్దరిని స్పష్టంగా గుర్తించగలిగినా... వాళ్ళ పేర్లు బయటకు తెలియజేయలేదు జితేంద్ర. తన జేబులో డబ్బు కోసం ఎవరో దారినపోయే దుండగులు చేసిన దాడిగా బొంకేడు.

చివరికి తను ఆశించినట్లుగా సమ్మె విఫలమైంది. కంపెనీ మళ్ళీ కార్మికులతో కళకళలాడటం సంతోషాన్ని కలిగించిగింది జితేంద్రకి.

సమ్మె విఫలమయిందంటే ఒప్పుకోలేదు సుజాత. ఢిల్లీలో గత రెండేళ్ళుగా కదలని వేజ్ రివిజన్ ఫైల్‌కి చలనం వచ్చిందంటే కారణం సమ్మె వజ్రాయుధం. ఫైల్ బ్యూరోక్రసీ నుంచి బయటపడి చకచకా కదిలి సెక్రట్రీల సంతకాలతో.. చివరికి మంత్రిగారి ముద్రతో క్లియర్ కాబడిందంటే నెలా పది రోజుల సమ్మె అందుకు కారణం అన్నది సుజాత. యాజమాన్యం కుట్ర పన్ని సమ్మెను విచ్ఛిన్నం చేసినా పరోక్షంగా విజయం కార్మికులదే అన్నది సుజాత.

సమ్మె విజయం సాధించడాన్ని ఏ యాజమాన్యం సహించదు.

సుజాత అన్నమాటను కొట్టిపారేయలేదు జితేంద్ర. ఎట్టకేలకు వేజ్ రివిజన్ జరిగింది.

ఉత్పత్తి దిశగా కార్మికులంతా పునరంకితులై నడుం బిగించేరు. యంత్రాలు పురి విప్పేయి. పొలాలనన్నీ హలాలు దున్ని ఇలాతలం హేమం పండించినట్లుగా.. కార్మికుల నెత్తిటి ఆవిర్లు.. వెచ్చటి ఊపిర్లు... స్వేద బిందువులు.. కర్మాగారాన్ని పూర్వవైభవ స్థితికి అందుకునేలా చేశాయి. ఆ తర్వాత ఆ ప్రభుత్వ రంగ సంస్థ వెనుతిరిగి చూడలేదు. ఉత్పత్తిలో రికార్డులు బద్దలు కొడుతూ, లాభాల బాటలో ప్రగతిపథంలో పురోగమించ సాగింది.

అలాగే జితేంద్ర కూడా ఉన్నత స్థాయికి ఎదగసాగేడు.

❁ ❁ ❁

2002 డిసెంబర్ మూడవ తేది. సమయం ఉదయం పది గంటలు.

జితేంద్ర ఆఫీసు రూమ్‌లో అవసరం లేకున్నా ఏసీ మిషన్ ఆన్ చేయబడి మరింత చల్లదనాన్ని ఇస్తోంది. కాలంతో నిమిత్తం లేకుండా ఏసికి అలవాటు పడిపోయింది అతని ప్రాణం. కిటికీలు, తలుపులు మూసి వుండడం చేత పట్టపగలే రెండు ట్యూబ్‌లైట్లు ఆ గదిలో వెలుగుతున్నాయి. గోడకి వేలాడుతున్న బోర్డ్‌పై ఉత్పత్తి లక్ష్యాలు, గీతలు, లెక్కలు వ్రాయబడి వున్నాయి.

జితేంద్ర పొడవుగా, కాస్త లావుగా, నెరిసిన తలకు నల్లరంగుతో నిగనిగలాడుతున్నాడు. వయసు యాభై మూడు సంవత్సరాలు. రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుని ముందుకీ, వెనక్కి సన్నగా ఊగుతున్నాడు.

నారాయణ చేతులు కట్టుకుని వినయంగా నించుకున్నాడు. నల్లగా, పొట్టిగా వయసు యాభై ఏళ్ళు దాటినా అతని శరీరం ఉక్కులా నిగనిగ మెరిసిపోతోంది.

ఇద్దరి మధ్య పెద్ద టేబుల్ ఉంది. టేబుల్‌పై ఒక కాగితం ఉంది. కాగితంపై పేపర్

వెయిట్ ఉంది. పేపర్ వెయిట్ అప్పుడప్పుడు జితేంద్ర చేతిలో బొంగరంలా తిరుగుతోంది.

"ఎందుకు సర్! పిలిచేరు?" అని అడిగే నారాయణ... తను వచ్చి రెండు నిముషాలైనా జితేంద్ర ఏమీ మాటాడకపోవడంతో.

"నీవు పియఫ్ లోన్‌కి అప్లయ్ చేశావా?"

"అవున్సార్"

"లోన్ అమ్మాయి పెళ్లికి అవసరమని రాసేవు... అందరూ రాసినట్లే! మీ అమ్మాయికి నిజంగానే పెళ్ళా?"

"అవున్సార్. నిజంగానే మా అమ్మాయి పెళ్లి"

"పెళ్లికి నన్ను పిలుస్తావా?"

"అదేమిటి సార్! అలాగంటారు. మీరు వచ్చి అక్షింతలు వేయకుంటే ఎట్లా?"

"అది సరే... ఆడపిల్ల పెళ్లంటే మాటలా! నీవు పెట్టిన లోను పెళ్ళికి ఏ మూలకి సరిపోతుంది?"

చిన్నగా నవ్వేడు నారాయణ.

"నేను చెప్పిన పని ఒకటి చేయి. నీ సమస్యలన్నీ పరిష్కారమైపోతాయి"

"ఏమిటి సార్"

"ఇదిగో ఈ కాగితంపై సంతకం పెట్టు. ఒక గంటలో నీ ముందు ఎనిమిది లక్షలు ప్రత్యక్షమవుతాయి" అని టేబుల్‌పై కాగితాన్ని నారాయణ చేతికి ఇచ్చేడు జితేంద్ర.

గతుక్కుమన్నాడు నారాయణ. చాలాసేపు నోటి మాట రాక స్తంభించిపోయేడు. ఆ కాగితంపై సంతకం పెట్టమనే బదులు... జితేంద్ర తనను చాచిపెట్టి లెంపకాయ కొట్టినా అంతగా చలించేవాడు కాదు.

సంతకం పెట్టమన్న కాగితం... వాలంటరీ రిటైర్‌మెంట్!

"నారాయణా! ఇది చక్కని అవకాశం. నీవు కంపెనీలో పనిచేస్తే ఇచ్చే జీతం రూపాయి. నీవు ఏ పనిచేయకుండా కంపెనీ వదిలి వెళ్ళిపోతే రూపాయిన్నర. నీ బేలన్స్ సర్వీస్‌కి ఎనిమిది లక్షలు వస్తుంది. అంత డబ్బు నీ జన్మలో చూసి వుండవు. అవునా! అమ్మాయి పెళ్ళే కాదు. సమస్త కష్టాలు తొలగిపోయే మార్గం ఇదే. వేగిరం సంతకం పెట్టి డబ్బు తీసుకో" అని సంతకానికి తొందర చేశాడు జితేంద్ర.

స్థాణువులా నించుండిపోయిన నారాయణ ఆ కాగితంపై సంతకం పెట్టలేదు.

అతనికెందుకో దుఃఖం కోపం ఎగసివస్తోంది.

"నారాయణా! మరేం ఆలోచించకు. నీ మంచి కోరే చెబుతున్నాను. సంతకం పెట్టు."

"ఇంతకాలం మీరు నా మంచికోరే వారిగా భావించాను సర్. కాని ఈ రోజు మీరు నాకు కొత్తగా, విచిత్రంగా కనిపిస్తున్నారు. మీకు గుర్తుందో లేదో సరిగ్గా ఇదే రోజు ఇరయ్యేళ్ళ క్రిందట మీరు మా ఇంటికి వచ్చేరు. అవి మేము సమ్మె చేస్తున్న రోజులు.

"ఆ రోజు మీరేమి అన్నారో తెల్సా! నాకు బాగా గుర్తుంది. 'నారాయణ లేకుండా వర్క్‌షాపుని ఊహించుకోవడం కష్టం' అన్నారు. రెండు రోజులు సెలవొస్తే ఇంటి దగ్గర బోర్ కొట్టేస్తుందని గిజగిజలాడిపోతావ్. చేతిలో పనిలేకపోతే పిచ్చెక్కిపోతావ్. అలాంటిది నెలా పది రోజులు ఏ పనీపాటు లేకుండా ఎలా ఉండగలుగుతున్నా'నని ఆశ్చర్యపోయేరు. ఆ రోజు మీరు నన్ను సమ్మెను విరమించి పనిలోకి రమ్మని హామీపత్రం ఇచ్చేరు. ఈ రోజు కంపెనీ వదిలి బయటకు పొమ్మని వీఆర్ఎస్ పత్రం ఇస్తున్నారు. ఎంత విచిత్రం!

"నా కింకా పదేళ్ళ సర్వీస్ వుంది సర్. నాది కష్టపడే తత్వం. మీరు నా మంచికోరి రోడ్డెక్కమంటున్నారు. మీ మంచితనాన్ని భరించడం నాకు సాధ్యమయ్యే పని కాదు సర్. క్షమించండి. నాకు వీఆర్ఎస్ వద్దు. నాకు పి.ఎఫ్. లోన్ శాంక్షన్ చేయండి చాలు. చెయ్యనంటారా ఫర్వాలేదు... మా అమ్మాయి పెళ్ళి ఆగిపోదు. పెళ్ళి కోసం నేను ఉద్యోగం వదులుకోవడాన్ని మా అమ్మాయి ఒప్పుకోదు. నా భార్య ఒప్పుకోదు. నా అంతరాత్మ ఒప్పుకోదు.

"ఉద్యోగం చేస్తూనే.. మా అమ్మాయి పెళ్లి చేసి, మిమ్మల్ని పెళ్ళికి పిలుస్తాను. నేను చేసే పనిలో లోపం ఏదైనా వుంటే చెప్పండి సర్. సరిదిద్దుకుంటాను. అంతే తప్ప నన్ను వీఆర్ఎస్ తీసుకుని బయటకు పొమ్మనకండి సర్. నేను మీరు ఇచ్చే లక్షలకి అమ్ముడు పోలేను సర్. నేను నమ్ముకునేది శ్రమని. కాయకష్టాన్నే సర్. కష్టించి అరవయ్యేళ్ళు పనిచేసిన తర్వాతే... నేను ఈ తల్లిని వదిలి వెళ్తాను సర్. అంతవరకు సెలవ్! వస్తాన్ సర్" అంటూ చేతులెత్తి దండం పెట్టి, కళ్ళనీళ్ళతో ఆ గది నుంచి బయటకు వచ్చేశాడు నారాయణ.

వెళ్ళిపోతున్న నారాయణని ఆపి మరోసారి కౌన్సిలింగ్ చేసే శక్తిని కోల్పోయేడు జితేంద్ర. నారాయణ గతాన్ని గుర్తు చేస్తుంటే నోరు పెగల్లేదు తనకి. చిరాగ్గా సిగరెట్ తీసి వెలిగించేడు. ఇరవై ఏళ్ళ కిందట తన నుదిటిపై తగిలిన దెబ్బను తడుముకున్నాడు. జితేంద్ర ఇప్పుడు ఆ ప్రభుత్వ రంగ సంస్థకి జనరల్ మేనేజర్!

❋ ❋ ❋

జితేంద్ర రేయింబవళ్ళు కంపెనీ వ్యవహారాల్లో తలమునకలయి రెస్ట్‌లెస్‌గా జీవితం సాగిస్తుంటే.. అతని భార్య సుజాత సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తృప్తిగా కాలం వెళ్ళదీస్తోంది. వాళ్లకి ఒకడే కొడుకు. అతడు ఇక్కడ లేడు. అమెరికాలో ఎం.ఎస్. చదువుతున్నాడు.

జితేంద్రతో సంసార నావ ఆమెకు సాఫీగా సాగిపోతున్నా.. ఒక కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా అధికారపు మెట్లు... ఎక్కుతున్న కొలదీ అతనిలో కనిపిస్తున్న మార్పు ఆమెను కాస్త కలవరపెడుతున్నది.

తను ఒక ముఖ్య అధికారి అయ్యేక సరళీకృత, నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాలకు ఒక ఏజెంట్ పాత్ర వహిచండం లేదు కదా అని ఆమెకు అనుమానం కలుగుతోంది.

తను చూస్తుండగనే మనిషిలో ఏమిటి ఇంత మార్పు?

అదే ఆమె అడిగితే మారుతున్న ప్రపంచంతో బాటు మనమూ మారక తప్పదు అని తేలిగ్గా అనేస్తాడు జితేంద్ర. ఏం మనిషి?

నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాల తాకిడికి దేశంలో పబ్లిక్ సెక్టార్ పునాదులు ఒకటీ ఒకటీ కదలి ధ్వంసమవుతున్న ప్రమాదస్థితిలో... మన కంపెనీని మనం కాపాడుకోవాలి, నిలబెట్టుకోవాలి అనే త్యాగభావన, దేశభక్తి అతనిలో కన్పించకపోవడం ఆమెకు ఆందోళన కలిగిస్తోంది.

"ఒకప్పుడు మీరు పబ్లిక్ సెక్టార్‌ని తల్లి అన్నారు. ఆధునిక దేవాలయం అన్నారు గుర్తుందా" అని ఆమె అంటే -

"గుర్తుంది. అయితే నేనలా అన్నది ఇప్పుడు కాదు. ఒకప్పుడు. అనగనగా ఒకప్పుడు. ఆ రోజులు వేరు. అనగా మన ఆర్థిక వ్యవస్థే పబ్లిక్ సెక్టార్‌లను కొమ్ము కాసే రోజులు. ఆనాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు నన్ను ఆ విధంగా ఫీల్ అయ్యేలా, స్పందించేలా చేశాయి. అంచేత అప్పుడు నేను అన్నది రైటే.. అలాగే నేడు కూడా నేను రైటే. నేడు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ వ్యవస్థ నన్ను అమితంగా ఆకట్టుకుంది. ఫాలో అవుతున్నాను. రేపు మరేదో కొత్త వ్యవస్థీకరణ వస్తే అటువైపు అయిస్కాంతంలా ఆకర్షింపబడతానేమో! అందులో సందేహం లేదు. అంచేత నేను చెప్పేదేమిటంటే.... ఏదీ మన చేతుల్లో లేదు. మనం మాత్రం మార్పు వైపు దూసుకుపోతున్న సమాజపు చేతుల్లో ఉన్నాం. మార్పుని ఆహ్వానించడం అనివార్యం" అని తేల్చేశాడు జితేంద్ర.

"అంటే మీరు ఆహ్వానించే మార్పు మంచికా, చెడుకా - ఎవరి ప్రయోజనాల కోసం అనేది మీకు పట్టదన్నమాట."

"నాకు మంచిగా తోచిన విషయం నీకు చెడుగా కనిపించవచ్చు. ఇది చాలా చిక్కు ప్రశ్న. ప్రపంచమంతా ముక్కలుగా, జాతులుగా విడిపోయింది ఇక్కడే. అంచేత మనం అనవసరంగా వాదనలకు దిగి మన బుర్రలు పాడు చేసుకోవద్దు. పద ప్రశాంతంగా భోజనం చేసి పడుకుందాం" అంటూ సుజాతను మరిక మాటాడనీయడు జితేంద్ర.

అతని ముందు ఎంతటి సీరియస్ విషయం ఎత్తినా, అర్థాంతరంగా పలచబడిపోతుంది. చివరికి చల్లబడిపోతుంది.

నారాయణ విషయం జితేంద్ర వద్ద కదపాలని చూస్తోంది ఆమె.

గంట క్రితం ఆమె వద్దకు నారాయణ వచ్చి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఇంతకాలం తన పనితనాన్ని గొప్పగా మెచ్చుకునే అయ్యగారు నిర్దాక్షిణ్యంగా విఆర్ఎస్ తీసుకుని బయటకు పొమ్మన్నారనే విషయం చెప్పి ఎంతగానో బాధపడ్డాడు.

ఏమి చేయగలదు తను? తన మాట వింటాడా?

ఆమె మాట ఆమె మొగుడు జితేంద్ర వినడు. జితేంద్ర మాట ఎమ్.డి. మొగుడు వినడు. ఎండీ మాట ప్రభుత్వం వినదు. ప్రభుత్వం మాట ప్రపంచ బ్యాంక్ మొగుడు

వినడు. నవ్వుకుంది సుజాత.

అయిదు వేల మంది ఉద్యోగుల్లో పదిహేను వందల మంది వరకూ వీఆర్‌ఎస్‌పై విజయవంతంగా పంపించేయగలిగేడు జితేంద్ర. అయితే ప్రభుత్వం అంతటితో తృప్తిపడకుండా మరో వెయ్యిమందిని బయటకు పంపించేయమని ఆదేశించింది. వీఆర్‌ఎస్ గాలానికి చేపలు మరిక పడడం లేదని చెబితే... కనీసం అయిదు వందలమందినైనా కంపెనీ గేటు బయటకు తోసేయమని ఒత్తిడి చేస్తోంది ప్రభుత్వం.

ఎంతగా ఒత్తిడి తెస్తున్నా, ఎన్ని తాయిలాలు ఆశ పెడుతున్నా మిగిలిన ఉద్యోగులు వీఆర్‌ఎస్‌పై ఉత్సాహం, సుముఖత చూపడం లేదు.

దీనికి యూనియన్ వ్యతిరేకత కూడా కొంత కారణం.

వీఆర్‌ఎస్‌పై కొంతమంది కార్మికులు బయటకు వెళ్ళిపోయేక కళ్ళు తెరిచింది యూనియన్. మిగిలిన కార్మికులను కాపాడుకునే యత్నంలో పడింది.

"కార్మికులారా! వీఆర్‌ఎస్‌ను తిరస్కరించండి' అంటూ వివరంగా ఒక కరపత్రం వేసింది. ఆ కరపత్రం సుజాతకి నారాయణ ఇచ్చేడు.

ఆమె చదివింది.

వీఆర్‌ఎస్ వల్ల అటు ఉద్యోగి, ఇటు పబ్లిక్ సెక్టార్ ఎంతగా నష్టపోయేది వివరాలు తెలియజేసింది యూనియన్ ఆ కరపత్రంలో.

"ప్రపంచ బ్యాంక్‌కి, ప్రభుత్వానికి పుట్టిన అక్రమ సంతానం ఈ వీఆర్‌ఎస్. దేశంలో నున్న మొత్తం ప్రభుత్వ సంస్థల్లో ఇరవై రెండు లక్షల మంది ఉద్యోగులను వీఆర్‌ఎస్ పేరిట బయటకు వెళ్ళగొట్టాలని ప్రపంచ బ్యాంక్ ఆదేశం. అందులో మన కంపెనీ టార్గెట్ రెండు వేల అయిదు వందలమంది.

"పాము పిల్లల్ని పామే తినేసినట్లు ప్రభుత్వమే ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తోంది. వీఆర్‌ఎస్‌తో ఉద్యోగుల సంఖ్య విపరీతంగా తగ్గించి ఏ బహుళజాతి సంస్థకో లాభాలలో వున్న మన కంపెనీని కారుచౌకగా అమ్మేయాలనేది ఢిల్లీ అధికారుల కుట్ర. అంచేత మనం వీఆర్‌ఎస్‌ను తిరస్కరిద్దాం. మన పరిశ్రమను ఏ విదేశీ తిమింగలాలు మింగేయకుండా, ఏ ప్రైవేటు రాకాసి బల్లులు కబళించకుండా కాపాడుకుందాం. అందుకు అవసరమైతే ఎటువంటి పోరాటాలకైనా మనం సిద్ధపడదాం" అని ఉంది కరపత్రం చివర్లో.

సుజాత చదివి "మీ యూనియన్ గట్టిదే. పోరాటాలు చేయగల శక్తి గలదే అని విన్నాను" అంది.

"అవును. మేడమ్! మా యూనియన్ గట్టిది. పటిష్టమైనది. యాజమాన్యంతో మిలాఖత్ అయి కార్మికులకి ద్రోహం చేసే దుర్మార్గపు యూనియన్ కాదు. మా యూనియన్‌ది యువరక్తం. ఒక ఉజ్వల శక్తి. ఒక ప్రభంజనం. ప్రైవేటైజేషన్‌కి వ్యతిరేకంగా ఇప్పటికే ఉధృతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తోంది. రోజూ కంపెనీ గేటు వద్ద నినాదాలు, వారం వారం ఊరేగింపులు,

రిలే నిరాహారదీక్షలు, బహిరంగ సభలు.. ఒక యజ్ఞంలా నిరంతరం ఆందోళన చేస్తూనే వుంది” అన్నాడు గర్వంగా నారాయణ.

“అవునవును. నేనూ విన్నాను. నారాయణా! మీకు కొండంత అండగా యూనియన్ ఉండగా నిన్న అయ్యగారు ఏదో అనేశారని కన్నీళ్ళు పెట్టుకుంటావేం?” అంది సుజాత.

నిజమే. నారాయణకి కన్నీళ్ళు ఆగడం లేదు. అతని గుండె గాయం అయింది. గత రాత్రంతా నిద్ర పట్టనేలేదు. గోడకి వేలాడుతున్న ‘ఉత్తమ కార్మికుడు’ బంగారు పతకం, ప్రశంసాపత్రాలు అతన్ని చూసి నవ్వుతూ, ఎగతాళి పట్టిస్తున్నట్టు అనిపించింది. పిచ్చెక్కినట్లు వాటిని ధ్వంసం చేసాడు. తనను అభిమానించే అధికారి విఆర్ఎస్‌పై బయటకు పొమ్మనటం.. ఒక ప్రియమైన తండ్రి అల్లారుముద్దు కొడుకుని ఇంట్లోంచి గెంటివేస్తున్నట్టుగా తల్లడిల్లిపోయేడు. తెల్లవారేక డ్యూటీకి వెళ్ళకుండా ఇంట్లోనే జ్వరం వచ్చిన రోగిలా ఉండిపోయేడు. సాయంత్రం జితేంద్రను ఇంటి వద్ద కలిసి ‘నన్నెందుకు అంత మాటన్నారు’ అని నిలదీద్దామని వెళ్ళేడు. జితేంద్ర ఆఫీసు నుంచి ఇంకా రాకపోవడంతో సుజాతతో తన గోడు చెప్పుకుని బావురుమన్నాడు నారాయణ.

“నీపై ఉన్న అభిమానం ఆయనకి చెదిరిపోయిందని నేను అనుకోను. ఏదో కారణంగా... అందరితో బాటు నిన్ను కూడా విఆర్ఎస్ తీసుకొమ్మని ఒత్తిడి చేసి వుంటారు. నారాయణా! నీవేం బాధపడకు. ఆయన వచ్చేక విషయం నేను కనుక్కుంటాను. ఆయన రేపు నిన్ను కలిసి జరిగింది పీడకలగా మర్చిపొమ్మంటారని నేను అనుకుంటున్నాను” అంది సుజాత.

“మీరేదో అంటున్నారుగాని... నాకు ఆ నమ్మకం లేదమ్మా! అయ్యగారు పూర్తిగా మారిపోయేరు. కంపెనీని, కార్మికులని ఒకప్పుడు ఎంత ప్రేమగా చూసుకునేవారో. ఇప్పుడు అంతకంటే ఇంకెంతగానో దూరమైపోతున్నారనిపిస్తోంది. అయితే ఒకటి మేడమ్! ఒక అధికారి మాకు దూరమైనా ఫర్లేదు. కాని మా కన్నతల్లి... కంపెనీని మాకు దూరం చేయకుంటే చాలు. వస్తానమ్మా” అని నమస్కరించి వెళ్ళిపోయేడు నారాయణ.

అతని మాటలకు సుజాత గుండె బరువయింది.

ఆఫీసు నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటలకి ఇంటికి చేరిన జితేంద్రకి.. మాటల మధ్యలో నారాయణ వచ్చి వెళ్ళిన విషయం తెలియజేసింది.

నొసలు చిట్లించేడు జితేంద్ర.

“అతన్ని మీరు విఆర్ఎస్ కౌన్సిలింగ్ చేయకుడా ఉండాల్సింది. పాపం చాల బాధపడుతున్నాడు.

“బాధెందుకు? కౌన్సిలింగ్ ఎవరికీ మినహాయింపు కాదు. నాకూ బాధలున్నాయి. నేనెవరికి చెప్పుకోను?”

“ఏమిటి?”

“విఆర్ఎస్ స్కోరింగ్ రేటు ఈ మధ్య ఏ మాత్రం పెరగకపోవడంతో నాకు బిపి

పెరిగిపోతోంది. ఢిల్లీ అధికారులు ఒత్తిడికి నా రక్తనాళాలు చిట్లిపోతాయనిపిస్తోంది. ఏం చెప్పమంటావు మా బాధలు? తొలుత కొందరిని ఏదోవిధంగా విఆర్ఎస్‌పై బయటకు పంపగలిగినా... రాను రాను కష్టతరమవుతుంది. స్వచ్ఛంద పదవీ విరమణని నిర్బంధంగా అమలు చేయడానికి పథకాలు వేయక తప్పలేదు. ఉద్యోగుల పాత రికార్డులు (అటెండెన్స్, ఎల్‌టిసి క్లెయిమ్‌లోని అవకతవకలు వగైరా) బయటకు తీసి భయపెట్టడాలు, బదిలీల బెదిరింపులు, ఉద్యోగి కుటుంబ ఆర్థిక పరిస్థితులపై దాడిచేసి మానసిక ఒత్తిడి కలిగించడాలు సాగిస్తుంటే.. యూనియన్ పక్కలో బల్లెమై ప్రతిఘటిస్తోంది. నారాయణ పిఎఫ్ లోన్‌కి అప్లయి చేయడంతో అతనిపై విఆర్ఎస్ అస్త్రం ప్రయోగించడం జరిగింది."

"నారాయణ పనితనాన్ని గొప్పగా ఆకాశానికెత్తే మీరు... అతణ్ణి విఆర్ఎస్‌పై బయటకు పొమ్మనడం విడ్డూరంగా వుంది. అతని లాంటి పనిమంతులు లేకపోతే ప్రొడక్షన్ దెబ్బతినదా? కంపెనీ నష్టాల్లోకి కూరుకుపోదా?" అని అడిగింది సుజాత.

గట్టిగా నవ్వేశాడు జితేంద్ర.

"నా కిప్పుడు పనిచేసే నారాయణకి పనిచేయని పుల్లారావుకి తేడా లేదు. అందరూ ఒకటే. రేపు ఈ కంపెనీ ప్రైవేటైజ్ అయ్యేక చచ్చినట్టు అందరూ కష్టపడి పనిచేస్తారు. అంతేకాదు హైర్ అండ్ ఫైర్ సిస్టంలో ఎంత గొప్ప పనిమంతుడైనా సరే అవసరం లేనప్పుడు నిర్ధాక్షిణ్యంగా బయటకు తోసివేయబడతాడు. ఇక ఉత్పత్తి అంటావా? అది రేపు ఈ కంపెనీని కొనేవాడు చూసుకుంటాడు. ప్రస్తుతం నా గోల్ అది కాదు. ఉద్యోగులను ఎంతవరకు తగ్గించగలమో అంతవరకు తగ్గించి, ఈ కంపెనీని అమ్మకానికి సింగారించి సిద్ధం చేయడమే."

"కార్మికులు ప్రైవేటైజేషన్‌కి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళన చేయడం మీరు చూస్తున్నారు. వాళ్ళ ఆక్రందనని పట్టించుకోరా?"

జితేంద్ర మళ్ళీ నవ్వి... "ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు ఈ కంపెనీ అమ్మకాన్ని ఏ మాత్రం ఆపలేవు. ఈ రోజు పేపర్లో వార్త చూడు" అంటూ తనతో ఆఫీసు నుంచి తీసుకు వచ్చిన ఎకనమిక్స్ టైమ్స్ పేపర్‌ను చూపించేడు.

చూసి.. చదివి.. నిశ్చేష్టురాలైంది సుజాత.

ఆ పబ్లిక్ సెక్టార్‌ని ప్రైవేటీకరించబోతున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిగారు స్పష్టంగా ప్రకటించేరు. అందుకు సంబంధించి బిడ్స్ సేకరణ, నెగోషియేషన్స్, తదితర ఫార్మాలిటీస్ అన్నీ గప్‌చుప్‌గా, గోప్యంగా, వేగంగా, సవ్యంగా సాగిపోతున్న వైనం పేపర్లో వివరించబడింది.

"ఇప్పుడేమంటావ్?" అంటూ వికవిక నవ్వేడు జితేంద్ర.

ఆ నవ్వుకి ప్రతిధ్వనిగా యుద్ధభేరి మ్రోగించినట్టు అనిపించింది ఆమెకు.

బాధతో, కోపంతో, కసితో, ఆత్మగౌరవంతో, త్యాగభావనతో, దేశభక్తితో, తపనతో కార్మికులు ఒక పోరాటానికి సమాయాత్తం కాబోతున్నట్లు అనిపించింది.

"శ్రామికులకు మంచిరోజులు తప్పక వస్తాయి" అన్నది సుజాత.